క్లుప్తంగా

నేడు వైఎస్సార్ వర్ధంతి

చీరాల: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొనాలని కోరారు.

మార్టూరులో వైఎస్సార్ వర్ధంతి ఘనంగా నిర్వహిద్దాం..

మార్టూరు: దివంగత నేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో నేడు నిర్వహించాలని ఆ పార్టీ మార్టూరు మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మండల కేంద్రం మార్టూరులో ప్రభుత్వ కార్యాలయాల వద్ద గల వైఎస్సార్ విగ్రహం వద్ద నేటి ఉదయం 10 గంటలకు వర్ధంతి నిర్వహించనున్నామని, పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అద్దంకి రూరల్: దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 15 వ వర్ధంతి అద్దంకిలో సోమవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి ఉదయం 10.30 గంటలకు హాజరై నివాళులర్పిస్తారన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

గల్లంతైన మత్స్యకారుల వివరాల సేకరణ


గ్రామంలో విచారిస్తున్న అధికారులు

చినగంజాం: చేపల వేట కోసం వెళ్లిన మత్స్యకారులు గల్లంతవడంతో అధికారులు గ్రామంలో విచారించారు. మండలంలోని రుద్రమాంబపురం గ్రామంలో రెవెన్యూ అధికారులు సందర్శించి సముద్రంలో ఆచూకీ కోల్పోయిన మత్స్యకారుల కుటుంబాలతో కలిసి మాట్లాడారు. మత్స్యకారుల బంధువులకు తమ వారు తిరిగి వచ్చేందుకు రెవెన్యూ పరంగా అన్ని చర్యలు తీసుకున్నట్లు వారు క్షేమంగా ఇళ్లకు చేరుకుంటారని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి ఎస్‌కే మునీర్, వెల్ఫేర్ అసిస్టెంట్ కే అంజిబాబు, గ్రామ ఫిషరీస్ సహాయకులు కే ప్రమీల, సాగర మిత్ర మల్లిఖార్జున నాయక్, మెరైన్ సిబ్బంది గ్రామంలో పర్యటించిన వారిలో ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదకరం

అద్దంకి రూరల్: మద్యం సేవించి వాహనాలు నడపటం ప్రమాదకరమని అద్దంకి ఎస్సై ఖాదర్ బాషా అన్నారు. ఆదివారం రాత్రి అద్దంకి పట్టణంలోని భవాని సెంటర్‌లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిని ఎస్సై అదుపులోకి తీసుకున్నారు. వారికి రోడ్డు ప్రమాదాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగటంపై కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తీసుకొని వాహనాలు నడుపుకుంటూ వెళ్లే సమయంలో రోడ్డు ప్రమాదాలు సంభవించవచ్చన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారు ఎంతటి వారిపైనైనా కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.


డ్రంక్ అండ్ డ్రైవ్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

పంట రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి


రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ మోహనరావు


రేణింగవరంలో మినుము పంటను పరిశీలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

- నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన అధికారులు
- ఆందోళనలో రైతన్నలు



వేటపాలెంలో నారుమడి నుంచి వర్షం నీటిని బయటికి పంపుతున్న రైతులు

పర్చూరు (చినగంజాం): వరి, పత్తి రైతులు అధిక వర్షాలకు పంటల రక్షణ కోసం తగు జాగ్రత్తలు తీసుకోవాలని పర్చూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎన్ మోహనరావు అన్నారు. మండలంలోని చెరుకూరు, కొత్తపాలెం గ్రామాల్లోని వరి, పత్తి పంటలను ఆదివారం ఆయన సందర్శించి పరిశీలించారు. రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పొలంలో నీటిని తీసివేసి ఎకరానికి 30 కేజీలు యూరియా, 15 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువును బూస్టర్ డోస్‌గా వేసుకోవాలని సూచించారు. వరి విత్తిన 15 నుంచి 20 రోజుల పైరులో కలుపు నివారణకు ఎకరానికి 100 మి.లీ బిస్‌పైరిబాక్ సోడియం 10 శాతం (ఎస్ఎల్)ను గానీ లేదా ట్రైయఫామెన్, ఇథాక్స్ సల్ఫ్యూరాన్ 30 శాతం (డబ్ల్యూజీ) మందును ఎకరానికి 90 గ్రాములను 200 నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

పత్తిపైరులో..

పైరులో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపి మల్టీ కే (13–0–45) లేదా 19–19–19లు ఒక లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు. ఒక లీటరు నీటికి 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ పిచికారీ చేయాలన్నారు. పత్తిలో నీటిని తీసిన తరువాత ఎకరానికి యూరియా 25 కేజీలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంఓపీ) 15 కేజీల ఎరువు బూస్టర్ డోస్‌లు వేయాలని తెలిపారు. బోరాక్స్ మందును ఒక లీటర్ నీటికి 1.5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని, పత్తిలో ఆకుమచ్చ బ్యాక్టీరియా తెగుళ్ల నివారణకు 10 లీటర్ల నీటికి కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రాములు, 1 గ్రాము ప్లాంటోమైసిన్ కలిపి పిచికారీ చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో చెరుకూరు, కొత్తపాలెం వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

90 ఎకరాల్లో పంట నష్టం..

వేటపాలెం: తుఫాన్ కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో సాగు చేసిన వివిధ రకాల పంటలు 90 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని ఏవో ఐ కాశీవిశ్వనాథ్ ఆదివారం తెలిపారు. 50 ఎకరాల్లో వేరుశనగ పంట, వరి 25 ఎకరాల్లో, మినుము 10 ఎకరాల్లో, వరి నారుమడి 5 ఎకరాల్లో వర్షం నీరు నిల్వడం వల్ల నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామని తెలిపారు. పొలాల్లో నిలిచిన వర్షం నీటిని త్వరగా బయటకి తరలించే ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు.

జే.పంగులూరు: పంట చేలల్లో నిలిచి ఉన్న నీటిని బయటకు పంపాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొండమూరు, రేణింగవరం గ్రామాల్లో నీట మునిగిన పంటల పొలాలను ఏఓ సుబ్బారెడ్డి పరిశీలించి రైతులకు సూచనలు అందించారు.

మార్టూరు: పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపి సక్రమ పద్ధతిలో సాగు చేసుకొని అధిక దిగుబడులు సాధించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వీ కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీటి లభ్యత అందినట్లు ఆయన తెలిపారు. మొక్కజొన్న, పత్తి, మినుము పంటలలో ఎకరాకు 25 కిలోల యూరియాతో పాటు 10 కిలోల పొటాష్ కలిపి చల్లాలన్నారు. మొక్కజొన్న పంటలు కాండం తొలిచే పురుగు, ఎండు తెగులు సోకే ప్రమాదం ఉన్నందున ఎకరాకు 400 మిల్లీ లీటర్లు ప్రొఫెనోఫాస్, 200 మిల్లీ లీటర్ల ప్రొపికెనజోల్‌తో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పత్తి పంటలో పూత రాలే అవకాశం ఉన్నందున ఎకరాకు బోరాక్స్ 1.5 గ్రాములు ఒక లీటర్ నీటితో కలిపి వారం రోజులు వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని తెలిపారు.

నిలిచిన నీరు.. దోమల విజృంభణ


కాలనీలో విపరీతంగా పేరుకుపోయిన చెత్త


కాలనీలో రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు

- పర్చూరు ఇందిరా కాలనీలో రోడ్లపై నిలిచిన వర్షపు నీరు
- బ్లీచింగ్ చల్లని పంచాయతీ అధికారులు

పర్చూరు (చినగంజాం): గడచిన రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పర్చూరు ఇందిరా కాలనీ పూర్తిగా నీట మునిగింది. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో కురిసిన వర్షపు నీరు మురుగు కాలువలు పొంగిపార్లి రోడ్లపై మురుగు నీరు చేరింది. భారీ వర్షాల కారణంగా మురుగు నీరు రోడ్లపై వచ్చి చేరడంతో కాలనీలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు నీరు నిలిచి పోవడంతో దోమలు తీవ్రంగా వ్యాప్తి చెందుతున్న క్రమంలో కాలనీ వాసులు అల్లాడి పోతున్నారు. మురుగు నీరు ప్రవహించడం చెత్త చెదారం పేరుకు పోవడం తీవ్రంగా దుర్గంధం వెదజల్లుతుందని కాలనీ వాసులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు కాలనీలలో కనీసం బ్లీచింగ్ కూడా చల్లటం లేదని వారు ఆరోపిస్తున్నారు.


ఇందిరా కాలనీలో నిలిచిపోయిన మురుగు నీరు

నీట మునిగిన వరి నారుమళ్లు


కొత్తపాలెం ప్రాంతంలో నీట మునిగిన భూములు

పర్చూరు (చినగంజాం): మండలంలోని పలు గ్రామాల్లో వరి నారుమళ్లు నీట మునిగాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా నారుమళ్లలో నీరు చేరడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు పలు ప్రాంతాలను సందర్శించి రైతులకు సూచనలు ఇచ్చారు.


పర్చూరులో వరి నారుమళ్లలో భారీగా చేరిన వర్షపు నీరు

ఉరకలేస్తున్న గుండ్లకమ్మ


నిండుగా పారుతున్న గుండ్లకమ్మ నది

- నీటితో నిండిన పొలాలు
- 111.4 మి.మీ వర్షపాతం నమోదు

అద్దంకి: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండ ప్రభావంతో రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ సమీపంలో ఉన్న గుండ్లకమ్మ నది ఉరకలేస్తూ పారుతోంది. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ వర్షాలు బాగా కురిశాయి. అద్దంకి మండలంలోని పొలాల్లోని చిన్న చిన్న వాగులు, వంకలు కళకళలాడుతున్నాయి. ఈవర్షం మెట్ట పంటలైన కంది, మొక్కజొన్న, జూట్, తదతర పంటలకు జీవం పోసింది. వర్షం నీటితో పొలాలన్నీ నిండి పోయాయి. ఇన్నాళ్లకు వాయుగుండ ప్రభావంతోనైనా వర్షాలు పడినందుకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వర్షానికి పొలాల్లో భారీగా నిలిచిన నీరు


2001-02 పదో తరగతి పూర్వ విద్యార్థులు

చేయిచేయి కలిపారు..
అండగా నిలిచారు

- దివ్యాంగురాలికి ద్విచక్రవాహనం
- పేద స్నేహితులకు నగదు సాయం అందించిన పూర్వ విద్యార్థులు

చీరాల టౌన్: అన్ని బంధాలోకన్నా స్నేహబంధం గొప్పదని నిరూపించారు పూర్వవిద్యార్థులు. తమతో పాటు చదువుకున్న వారిలో కొందరు చనిపోయారు.. ఇద్దరు తీవ్ర ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న తెలుసుకున్న తోటి విద్యార్థులు అందరూ చేయిచేయి కలిపి ఆర్థిక సాయం అందించడంతో పాటుగా దివ్యాంగ స్నేహితురాలికి ద్విచక్రవాహనం అందించి అండగా నిలిచారు 2001–02 బ్యాచ్ పదో తరగతి పూర్వపు విద్యార్థులు. ఆదివారం మండలంలోని ఈపురుపాలెం గ్రామంలోని నేతాజీ యూనియన్ కళ్యాణ మండపంలో తమతో పాటుగా చదువుకున్న విద్యార్థులు కలిసి పేద ముస్లిం దివ్యాంగ యువతికి మోటార్ సైకిల్, తీవ్ర ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న ఇద్దరికి ఆర్థిక సాయం అందించారు. అంతేకాకుండా మృతిచెందిన స్నేహితుని కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. అప్పటి పూర్వ విద్యార్థులు కలిసి వేడుకగా తమ స్నేహితులను ఆదుకుని అండగా నిలవడంతో ఆనందం వెల్లివెరిసింది. ప్రస్తుత బిజీ లైఫ్‌లో స్నేహితులు కలవడమే అరుదుగా మారిందని, కానీ తమతో పాటుగా చదువుకుని ఇబ్బందుల్లో ఉన్న తోటి స్నేహితులకు సాయం అందించి మనో ధైర్యాన్ని కల్పించడం మరింత ఆనందంగా ఉందని వారు చెప్పారు. పూర్వ విద్యార్థుల చొరవ అందరికి ఆదర్శనీయంగా మారిందని పలువురు అభినందించి హర్షం వ్యక్తం చేశారు. కమిటీ ప్రతినిధులు మూసా, నాగరాజు, దావూద్‌వలి, తులసీ, ప్రసన్న, విజయలక్ష్మీ, జరీనా, కళ్యాణి, నాగరాజు, షరీఫ్, పేతురు, నరేష్, జయప్రకాష్, రోహిణీ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న దాత

అద్దంకి/అద్దంకి రూరల్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చుండూరి మురళీ సుధాకర్ ప్రోత్సాహంతో 428వ రక్తదానం అందజేశారు. బైపాజ్ సర్జరీ నిమిత్తం విజయవాడ మణిపాల్ ఆసుపత్రి చేరిన అద్దంకి వ్యాయామ ఉపాధ్యాయుడు ముద్దన విష్ణు ప్రసాద్‌కు ఏబీ పాజిటివ్ రక్తం అవసరమని రోగి బంధువులు రోటరీ క్లబ్ కార్యాదర్శి చుండూరి మురళీ సుధాకరరావుకు తెలియజేయగా అద్దంకిలోని శివా రెడ్డి, చెన్నుపల్లి వాసు, ప్రసన్న వర్షంలో విజయవాడ వెళ్లి రక్తదానం చేశారు. రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య రక్తదాతలకు అభినందనలు తెలిపారు.

- వాసవీ క్లబ్ వ్యవస్థాపకుడు కేసి గుప్తా జన్మదిన సందర్భంగా ఆదివారం వాసవీ క్లబ్‌లో 30 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి తమ్మన శ్రీనివాసరావు శికాకొల్లి సురేష్, మెంబర్స్‌కు పండ్లు, సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ వీవీ ఆదినారాయణ, సెక్రటరీ జీ పాపారావు, వనిత క్లబ్ ప్రెసిడెంట్ వీ విజయలక్ష్మి, సెక్రటరీ ఎస్ అంజలి, ఉమా అన్నపూర్ణ, ఐతరాజా, బ్లడ్ ఇన్‌చార్జ్ గార్లపాటి బ్రహ్మానందం పాల్గొన్నారు.

తుఫాన్ నేపథ్యంలో గర్భిణులపై శ్రద్ధ


వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చినగంజాం: గర్భిణులు ప్రకృతి వైపరీత్యాల సంభవిస్తున్న తరుణంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ ఎస్ విజయ భాస్కర్ సూచించారు. అల్పపీడనం, తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని పల్లెపాలెం పంచాయతీ బాపయ్య నగర్ గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో గర్భిణులు, బాలింతల సర్వే నిర్వహించి వారికి తగు జాగ్రత్తలను తెలియజేశారు. వర్షాలు ఉధృతంగా పడుతున్న నేపథ్యంలో గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొనకుండా సమాచారాన్ని ఎప్పటికప్పుడు వైద్యసిబ్బందికి తెలియజేయాలని వైద్యాధికారి సూచించారు. గ్రామంలో మొత్తం పలు సమస్యలతో బాధ పడుతున్న 23 మందికి వైద్య చికిత్స అందించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నాగేంద్రం, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశలు పాల్గొన్నారు.



ఇంటి ముందుకు నీళ్లు వచ్చాయని కర్రలతో దాడి

అద్దంకి రూరల్: ఇంటి ముందు ఉన్న పూల మొక్కలకు నీళ్లు పోస్తే తన ఇంటికి ముందుకు వస్తున్నాయని ఆ ఇంటి యజమానిపై దాడి చేశారు. ఈ ఘటనపై ఆదివారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఖాదర్ బాషా కేసు నమోదు చేశారు. ఎస్సై వివరాల మేరకు.. మండలంలోని రామాయపాలెం గ్రామంలో నాగుబాబు రాజేష్ తన ఇంటి ముందునున్న మొక్కలకు నీళ్లు పోస్తుండగా ఆ నీళ్లు తన ఇంటిముందుకు వస్తున్నాయని గొచిపాదుల భాగ్యలక్ష్మీ కట్ట వేశారు. ఈ క్రమంలో ఆ కట్టను రాజేష్ తండ్రి మునలయ్య తొలగిస్తుండగా భాగ్యలక్ష్మీ, ఆమె భర్త శామ్యూలు, వారి బంధువులైన ఏసోబు, కళ్యాణ్, సువర్ణలు కర్రలతో దాడి చేశారు. ఈదాడిలో అడ్డువచ్చిన రాజేష్‌కు గాయాలయ్యాయి. గాయాలైన తండ్రీ,కొడుకులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.

తండ్రి తప్పిపోయాడని ఫిర్యాదు

అద్దంకి రూరల్: మతి స్థిమితం లేక తన తండ్రి ఇంటి నుంచి వెళ్లి పోయి కనబడటంలేదని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఖాదర్‌బాషా ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. ఎస్సై వివరాల మేరకు.. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన మాగులూరి శివరామిరెడ్డి తన తండ్రి అయిన సుబ్బారెడ్డి 73 సంవత్సరాలు మతి స్థిమితం లేని కారణంగా గత 15 నెలల క్రితం ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతని కోసం బంధువుల ఇళ్లల్లో, తెలిసిన గ్రామాల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవటంతో ఆదివారం అద్దంకి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

యూపీఎస్ విధానం రద్దుచేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అద్దంకి రూరల్: యూపీఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు ఆదివారం అద్దంకి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏటీఎఫ్ జోన్ నాయకులు మలాది నాగరాజు, కరి రామయ్య, రహింతుల్లా, శకంరరావు, అశోక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాతిముఖ మండప నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న భక్తులు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్య క్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన ముఖ మండప నిర్మాణానికి మండలంలోని కొంగపాడు గ్రామానికి చెందిన భక్తులు కమ్మ నాగేశ్వరరావు, వెంకట సుజాతలు రూ. 1 లక్షను దేవస్థాన అధికారి పెద్దినేని శ్రీనుకు అందజేశారు.

మాజీ జెడ్పీటీసీ తులశమ్మ కన్నుమూత


యార్లగడ్డ తులశమ్మ (ఫైల్)

పర్చూరు (చినగంజాం): పర్చూరు తొలి మహిళా మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు, వీరన్న పాలెం గ్రామానికి చెందిన యార్లగడ్డ తులశమ్మ (75) ఆదివారం కన్నుమూశారు, గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.